క్లుప్తంగా

ప్రతి ఇంటికీ మంచి నీరు



ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి, సర్పంచు శారదమ్మ

బత్తలపల్లి: ప్రతి ఇంటికీ మంచి నీరు అందించేందుకు కృషి చేస్తామని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. సోమవారం మండలంలోని అప్పరాచెరువు గ్రామం జగనన్న లేఅవుట్‌లో రూ.28.84 లక్షలతో జలజీవన్ మిషన్ కింద ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీతో పాటు సర్పంచు మొర్రెడ్డిగారి శారదమ్మ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అప్పరాచెరువు గ్రామంలోని ప్రతి ఇంటికీ త్వరలో మంచినీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, కార్యదర్శి అలువేలుమంగమ్మ, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోనారెడ్డి, నారాయణస్వామి, అశోక్, మాధవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొత్తచెరువు: మండల ఆర్‌ఐగా కుంచపు దుర్గేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిలమత్తూరు ఆర్‌ఐగా పని చేస్తున్న దుర్గేష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అంతకుముందు తహసీల్దార్ రామాంజినేయ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక



విద్యార్థిని శ్రావణితో అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు తమ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శ్రావణి ఎంపికైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 10 వరకూ విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో జరగనున్న ఎన్ఎస్ఎస్ వెస్టన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌లో శ్రావణి పాల్గొంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి, అధ్యాపకులు భానూత్‌గోపాల్‌నాయక్, చిట్టమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, పావని, భువనేశ్వరి, ఆనంద్, హేమావతి, స్వామి తదితరులు అభినందించారు.

నేడు మండల సమావేశం

నల్లమాడ: మండల సాధారణ సర్వ సభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

అక్రమార్కులపై 'సెబ్' దాడులు



ఇసుక ట్రాక్టర్ చూపిస్తున్న సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సెబ్ పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనకల్లు సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలోని అమడగూరు మండలంలో అక్రమంగా తరలిస్తున్న 4 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకున్నారు. ఒక ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలోని హంద్రీనీవా బ్రిడ్జ్ వద్ద 192 కర్ణాటక మద్యం పాకెట్లు పట్టుకుని, బైకు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. చెన్నేకొత్తపల్లి సెబ్ స్టేషన్ పరిధి గంగినేపల్లి తాండాలో 40 లీటర్ల ఊట సారా ధ్వంసం చేశారు.

వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు తరలిస్తున్న దృశ్యం

నల్లచెరువు: 'జగనన్న గోరుముద్ద' పథకంలో భాగంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి ప్రభుత్వం మంజూరు చేసిన వంట పాత్రలను పలు పాఠశాలలకు ఎంఈఓ తిరుపాల్ నాయక్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పిల్లల సంఖ్యను బట్టి పాత్రలను పంపిణీ చేశామన్నారు. ఏజెన్సీ వారు గ్యాస్ పైనే పిల్లలకు భోజనాలను తయారు చేయాలని సూచించారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



రైతులు, కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: రైతన్నలూ అధైర్యపడవద్దు...అండగా మేమున్నాం...సత్వరమే పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం ద్వారా అందించే విధంగా చర్యలు చేపడతామంటూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భరోసానిచ్చారు. సోమవారం మండల పరిధిలోని పోతులనాగేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల సమపంలో వేరుశనగ, కంది పంట పొలాలను ఆయన పరిశీలించారు. పలువురు రైతులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక వేరుశనగ పంట ఎండిపోయిందని, పశువులకు మేత ఉండాలని తొలగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పందిస్తూ పంటనష్టానికి సంబంధించిన సమగ్ర నివేదికను సత్వరం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నియోజవర్గంలోని ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో వర్షాభావం కారణంగా వేరుశనగ పంట దెబ్బతిందన్నారు. రైతులకు ప్రభుత్వం బీమా పథకం ద్వారా ప్రతియేడు సాయం అందిస్తోందన్నారు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారన్నారు. ఏ సీజన్‌లో పంటనష్టం జరిగితే ఆ సీజన్‌లోనే పరిహారం విడుదల చేసి రైతులకు సాయం అందిస్తున్నారన్నారు. ఈ యేడాది కూడా పంటనష్టం నివేదికను అధికారులు పూర్తి చేసిన తర్వాత రైతులకు న్యాయం జరిగేలా పరిహారం వీలైనంత ఎక్కువ అందించేందుకు సీఎం దృష్టికి సమస్య తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రావులచెరువు ప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ పోతుకుంట రామయ్య, మండల వ్యవసాయ సంఘం అధ్యక్షుడు మాలగుండ్లపల్లి కేశవరెడ్డి, ధర్మవరం వ్యవసాయశాఖాధికారులు ముస్తఫా, రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, పోతిరెడ్డి, రవీంద్రారెడ్డి, శివారెడ్డి, నర్సిరెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి

తాడిమర్రి: 'స్పందన'లో వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ నాగరాజు అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో వచ్చే అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఎంఈఓ వెంకటేష్, ఏపీఎం సాంబశివుడు, ఏపీఓ సంజీవరెడ్డి, పీఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీ, హౌసింగ్ ఏఈ మహేష్, ట్రాన్స్‌కో ఏఈ విజయశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దు

బత్తలపల్లి: స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో 12 అర్జీలు అందినట్లు తెలిపారు. భూ సమస్యలపై 8 అర్జీలు, పొజిషన్ సర్టిఫికెట్ల కోసం 3, మరణ ధృవీకరణ పత్రం కోసం ఒక్క అర్జీ చొప్పున అందినట్లు తెలిపారు. భూ సర్వేలో తమ భూముల్లో ఎక్కువ భూమి నష్టపోతున్నట్లు కోడేకండ్ల గ్రామంలోని పలువురు రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో భూ సర్వే తహసీల్దార్ సునిత, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



బ్రోచర్లు విడుదల చేస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను పోత్సహించడమే లక్ష్యంగా సత్యసాయి క్రికెట్ క్లబ్ పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి పట్టణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం క్రికెట్ క్లబ్ బ్రోచర్లు, టోర్నమెంట్ కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో యువత, విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి సత్యసాయి క్రికెట్ క్లబ్ ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 21న ప్రారంభించి 31 వరకూ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. ఆయా మండలాల్లో నవంబర్ 1 నుంచి 30 వరకూ సత్యసాయి క్రికెట్ క్లబ్‌లో సభ్యత రుసుం చెల్లించి జట్లు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 6 మండలాలు, మున్సిపాలిటీ కలుపుకొని 40 క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామన్నారు. విజేత జట్టుకు రూ. 2 లక్షల నగదు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ. లక్ష, ట్రోఫీ, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 50 వేలు, ట్రోఫీ అందజేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు సహకరించి క్లబ్‌ను ముందుకు నడిపించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, ఎంపీపీ రమణారెడ్డి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, సూర్యనారాయణ, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు మెంబర్ షాన్‌షేన్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సోముశేఖర్‌రెడ్డి, నాయకులు మటన్ శంకర్, రామాంజనేయులు, క్లబ్ మెంబర్ డాక్టర్ బొగ్గు సురేష్, గూడా సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబాలకు అండగా ఉంటాం



వలంటీర్ కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: వలంటీర్ల కుటుంబాలకు అండగా ఉంటామని రాప్తాడు ఎంఎల్ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్న గొల్లరాజేష్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.2 లక్షలు అందించారు. గత నెలలో మరో వలంటీర్ శశికళ భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బాధితురాలికి రూ.లక్షను అందించారు. అదే గ్రామంలో రజిని అనే మహిళ భర్త కొన్నాళ్ల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఓదార్చి వారికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. రామగిరి గ్రామంలో పెద్దమ్మ ఆలయానికి రూ.50 వేలు విరాళంగా అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, అధికారులకు వారధులుగా వలంటీర్లు చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ మీనుగ నాగరాజు నాయకులు రామాంజనేయులు, ఓబిరెడ్డి, కోనంకి ముత్యాలు, శ్రీరాంనాయక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు అరికట్టాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్

బత్తలపల్లి: మాతా శిశు మరణాలు అరికట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలకు అవగాహన కార్యక్రమాన్ని వైద్యాధికారి గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మాతా శిశు మరణాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్టేట్ ఆఫీస్ రీజినల్ కిల్కారి మొబైల్ అకాడమీ పోగ్రాం ఆఫీసర్ కీర్తి.. కిల్కారి మొబైల్ అకాడమీ గురించి వివరించారు. వైద్యాధికారి గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా శిక్షణ తీసుకొని గ్రామస్థాయిలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమం విజయవంతంగా జరిపించాలని కోరారు. గర్భం దాల్చిన నాలుగో నెల మొదటి వారం నుంచి ఆ బిడ్డ పుట్టిన తర్వాత ఒక సంవత్సరం పూర్తయ్యే వరకూ కిల్కరీ ఆడియో మెసేజ్, కాల్స్ వస్తాయన్నారు. ఒకవేళ కాల్ వినలేని పరిస్థితిలో 14423కి టోల్ ఫ్రీ కాల్ చేసి వినవచ్చన్నారు. మొబైల్ అకాడమీ టోల్ ఫ్రీ నంబర్ 14424 ఆశాల ట్రైనింగ్ కోసం ఏర్పాటు చేసిన ట్రైనింగ్ కోర్సు అన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కమ్యూనిటీ మొబిలైజర్ త్రిలోక్‌నాథ్ పొగాకు వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రామకృష్ణ, సీహెచ్‌ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ, బత్తలపల్లి, తాడిమర్రి, దర్శినమల, కనగానపల్లి, పేరూరు, రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పబ్లిక్ హెల్త్ నర్సులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: 'మాతా శిశు సంరక్షణ' కార్యక్రమాలను విజయవంతం చేద్దామని కిల్కారి మొబైల్ అకాడమీ ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఆశాలకు అవగాహన కల్పించారు. ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు మహబూబ్ భాష, బాబాఫక్రోద్దిన్, వేణుగోపాల్‌రెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



ఓడీచెరువు: ప్రజలతో సమావేశమైన అధికారులు



అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: ప్రజలు తమ హక్కులను తెలుసుకుని ప్రశాంతంగా జీవించాలని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని జగజ్జీవన్‌రామ్‌నగర్‌లో సోమవారం రాత్రి పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా వార్డు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టపరిధిలో జీవించాలన్నారు. పౌరహక్కులను ఉల్లంఘించేందుకు ఎవరికీ హక్కులేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక చట్టాలున్నాయని తెలిపారు. ఎవరైనా కులం పేరుతో దూషించినా, దాడులు చేసినా ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామన్నారు. చాలా మందికి పౌరహక్కులు ఏమి ఉన్నాయో తెలియదన్నారు. ప్రతి ఒక్కరూ తెలుసుకుని సమాజంలో ప్రతిఒక్కరితో స్నేహపూర్వకంగా మెలగాలని శాంతియుతంగా జీవించాలని సూచించారు.

హక్కులను గౌరవించాలి

ఓడీచెరువు: పౌర హక్కులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ రామనాథ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సున్నంపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. స్థానికుల సమస్యలపై ఆరా తీశారు. పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. డయల్ 100, దిశ యాప్, గృహహింస చట్టం, బాల్యవివాహాలు,సైబర్ నేరాలపై ఎస్ఐ మల్లికార్జున రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పౌరహక్కులను విస్మరించవద్దు

బత్తలపల్లి: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఏ ఒక్కరు విస్మరించవద్దని ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ సాయి మనోహర్ తెలిపారు. మండలంలోని సంజీవపురం ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి జాతీయ పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులందరికి రాజ్యాంగం కుల, మత, వర్ణ, పేద, ధనిక భేదభావం లేకుండా జీవించడానికి ప్రసాదించిన పౌర హక్కులను అన్ని వర్గాలవారు అనుసరించాలన్నారు. స్వేచ్ఛగా జీవించడానికి ప్రతిఒక్కరికి హక్కు ఉందని అన్ని కులాలవారు సమైక్యంగా జీవించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లను ఉద్దేశపూర్వకంగా దుర్వినియోగం చేయవద్దని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలకు పాల్పడితే నిర్భయంగా పోలీసులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీకాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మైలసముద్రంలో..

కొత్తచెరువు: సివిల్ రైట్స్ డే సందర్భంగా మండలంలోని మైలసముద్రం గ్రామ ఎస్సీ కాలనీలో తహసీల్దార్ రామాంజినేయ రెడ్డి, ఎస్ఐ సురేష్ బాబు అవగాహన కల్పించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకొని పౌరుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటకోత ప్రయోగాలు



పోట్లమర్రిలో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా సాగు చేసిన వేరుశనగ పంటలో పంటల దిగుబడి అంచనా కోసం అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. సోమవారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో సర్వే నంబర్ 120-6లో యల్లప్ప వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ పంటలో ప్రయోగాలను చేపట్టారు. మండల వ్యసాయాధికారి ఓబిరెడ్డి, మండల గణాంక అధికారి డాక్టర్ కేఎల్ లక్ష్మీనరసింహశర్మ, ఎంపీఈఓ రవికుమార్, విఆర్ఏ నారాయణస్వామి, రైతు విష్ణువర్ధన్ తదితరులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. కేవలం 750 గ్రాములు దిగుబడి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. వేరుశనగ పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే పలువురు వేరుశనగ పంటను తొలగించారు.

'వైఎస్సార్ బీమా' తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్, ఎంపీపీ

గాండ్లపెంట: మండల పరిధిలోని తుమ్మలబైలు పెద్దతండా పంచాయతీ గరుగుతండాకు చెందిన నాగలక్ష్మమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద నామిని అయిన కుమారుడు ఆనంద్‌నాయక్‌కు తక్షణ సాయం కింద రూ.10 వేలను సోమవారం గ్రామ సర్పంచ్ బుజ్జే రవీంద్రనాయక్, ఎంపీపీ తాతం జగన్మోహన్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాషా, మానస, తదితరులున్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపిక



ధర్మవరం అర్బన్: సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల చెస్ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి పూజిత ఎంపికైందని బీఎస్‌కే చెస్ అకాడమి కోచ్‌లు ఆదిరత్నకుమార్, కిషోర్‌కుమార్ తెలిపారు. రెండురోజుల క్రితం నెల్లూరు జిల్లా కావలిలో అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచడంతో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు పూజితను ఎంపిక చేశారన్నారు. నవంబర్ రెండోవారంలో తమిళనాడులో ఈ పోటీలు జరగనున్నాయని వారు తెలిపారు.

ఎస్సీ,ఎస్టీల భూములను పరిరక్షించాలి

కదిరి అర్బన్: కదిరి డివిజన్‌లో ఎస్సీ,ఎస్టీ భూములను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జిల్లా మానవహక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంగులయ్య ఆర్డీఓ వంశీకృష్ణను కోరారు. సోమవారం ఆయనతో పాటు కమిటీ సభ్యులు, రాంప్రసాద్‌నాయక్, మునీంద్ర, మల్లికార్జున తదితరులు ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రీడాకారిణులకు ఆర్థిక చేయూత

నల్లచెరువు: స్కూల్ గేమ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మండల పరిధిలోని దేవిరెడ్డి పల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 13 మందికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ హైదర్‌వలి తనవంతు చేయూత అందించారు. క్రీడా దుస్తుల కోసం రూ.6.5 వేలు సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి డైరెక్టర్ ఆదిమూర్తి, మాధవరెడ్డి, చిన్నపల్లి హరి, మంజునాథ, సూర్యశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అక్బర్, ప్రిన్సిపాల్ రాణాప్రతాప్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, పీఈటీ హరి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన ఆటో డ్రైవర్ కేశవ

ధర్మవరం అర్బన్: అగ్ని ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన పట్టణంలోని వైఎస్సార్‌కాలనీలో చోటుచేసుకుంది. వైఎస్సార్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కేశవ సోమవారం ఇంటి వద్ద ఆటోలోకి డీజిల్ పోస్తుండగా పక్కనే కట్టెల పొయ్యి నిప్పురవ్వలు డీజిల్‌కు తగిలి మంటలు చెలరేగాయి. కేశవ ఛాతికి మంటలు వ్యాపించి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు.

వైభవంగా వాల్మీకి మహర్షి జయంతి



జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కనగానపల్లి: మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. స్థానిక మార్కెట్ సర్కిల్లో ఉన్న వాల్మీకి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వాల్మీకుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వందలాది మంది మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. స్థానిక వాల్మీకి సంఘం నాయకులు, కులపెద్దలు పాల్గొన్నారు.

పెద్దకొండాపురంలో..

రామగిరి: మండలంలోని పెద్దకొండాపురంలో వాల్మీకి జయంతి వేడుకలను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, వీధుల గుండా బోనాలు మోసుకెళ్లి సమర్పించారు.

ద్విచక్ర వాహనాల చోరీ

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో 3 ద్విచక్రవాహనాలను దుండగులు అపహరించారు. బస్టాండ్ వద్ద ఆపి పని మీద అంబేడ్కర్ సర్కిల్ వచ్చి తిరిగి వెళ్లి చూస్తే ద్విచక్రవాహనాలు కనిపించలేదని కదిరికి చెందిన రామ్‌గోపాల్ తెలిపాడు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

2న సర్వసభ్య సమావేశం

తలుపుల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నవంబర్ 2న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని కోరారు.

పట్టా మంజూరు చేయాలంటూ వినతి

ఎన్పీకుంట: తన వ్యవసాయ పొలానికి పట్టా మంజూరు చేయాలని జౌకల గ్రామానికి చెందిన ఆర్.జగన్ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. 2004వ సంవత్సరం నుంచి పలు మార్లు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. తహసీల్దార్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

నల్లచెరువు: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ అమర వీరులకు జేజేలు పలుకుతూ స్థానికులు, విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ చేశారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్: పెళ్లిలో డెకరేషన్‌కు సంబంధించి గొడవ చోటుచేసుకుంది. కదిరి పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు.. మండల పరిధిలో కుమ్మరవాండ్లపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అర్ధరాత్రి డెకరేషన్ చేసే అల్లా అనే వ్యక్తికి, మహ్మద్, షఫాకత్‌లకుగొడవ జరిగింది. అల్లా తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో ఇద్దరినీ గాయపరిచాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

అమడగూరు: బ్యాంకు మేనేజర్ చేతిలో మోసపోయిన తమకు న్యాయం చేయాలంటూ సోమవారం పలువురు బాధితులు సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఏపీజీబీ ఎదురుగా ధర్నాకు దిగారు. ఎస్ఐ బలరామయ్య, ఏఎస్ఐ ధనుంజయ, ప్రస్తుత బ్యాంకు మేనేజర్ బాధితులతో మాట్లాడారు. 20 రోజుల్లోగా సమస్యను పరిష్కరింపజేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు.

పోషణ కిట్ల పంపిణీ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా పోషణ కిట్లు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రోగులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి చూపు సరిగా లేని వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ వెంకట రమణప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లగుండ్ల భాస్కర్, నాయకులు చంద్రాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, సేవేనాయక్ రామకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.